క్లుప్తంగా

గాలివాన బీభత్సం


గూడెం రహదారిపై విరిగిపడిన చెట్లు

చింతలమానెపల్లి: మండలంలో మంగళవారం రాత్రి వీచిన గాలివాన బీభత్సం సృష్టించింది. మండలంలోని గూడెం, కోయపెల్లి, దిందా, బూరుగూడ, శివపెల్లి గ్రామాలలో వీచిన భారీ గాలులకు ప్రజలు ఆందోళనకు గురయ్యారు. గాలులతో పాటు రాళ్లవానతో ఇబ్బందులు పడ్డారు. మండలంలోని కోయపెల్లి గ్రామంలోని ఆత్రం సౌమ్య అనే మహిళ ఇంటి పైకప్పు రేకులు లేచిపోగా ఆస్తి నష్టం జరిగింది. మండల కేంద్రం నుంచి గూడెం వెళ్లే రహదారిలో పలుచోట్ల చెట్లు నేలవాలాయి. రహదారిపై చెట్లు విరిగిపడడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కాగా స్థానికులు చెట్లను తొలగించారు.

కాంగ్రెస్‌లో చేరికలు


కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు ఆవుల రాజ్‌కుమార్ బుధవారం ఎమ్మెల్సీ దండె విఠల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ నివాసంలో పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న ప్రజాసంక్షేమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట బారెగూడ మాజీ ఎంపీటీసీ వడాయి సంతోష్, అమ్మ శ్రీకాంత్ ఉన్నారు.

పదవీ విరమణ పొందిన కార్మికుడికి సన్మానం



సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి బుధవారం పదవీ విరమణ పొందిన రాజన్న దంపతులను సీహెచ్‌పీ అధికారులతో పాటు తోటి కార్మికులు, ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజన్న దంపతులను పూలమాలలు, శాలువాలతో సన్మానించి వీ డ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని సుఖశాంతులతో గడపాలని కోరారు. కార్యక్రమాల్లో ఐఎన్‌టీయూసీ కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ సంగెం ప్రకాశ్‌రావు, ఏరియా నాయకులు సదాశివ్, గట్ట య్య, కుమార్, వామన్, సీహెచ్‌పీ ఫిట్ సెక్రటరీ రవి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ కొవ్వూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం


బెజ్జూర్: మాట్లాడుతున్న ఎస్సై ప్రవీణ్ కుమార్

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై కొమురయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు విధులను సైతం సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నేటికీ గ్రామాల్లో కనిపిస్తున్న అంటరానితనాన్ని రూపుమాపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చట్టాలు పౌరులకు కల్పిస్తున్న సహాయాన్ని వివరించారు. రెవెన్యూ, పంచాయితీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బెజ్జూర్: ఎలాంటి వివక్ష లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామంలో సివిల్ రైట్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామాల్లో కుల వివక్ష లేకుండా ఉండాలని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ ఫలాలు పొందడం రాజ్యాంగం కల్పించిన హక్కేనన్నారు. ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలన్నారు. సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్ఐ రవీందర్, జూనియర్ అసిస్టెంట్ దేవాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘పది’లో విద్యార్థుల సత్తా

92శాతం ఉత్తీర్ణత..

దహెగాం: పదో తరగతి వార్షిక పరీక్షల ఫలి తాలు బుధవారం వెలువడ్డాయి. మండలంలో ని విద్యార్థులు 92 శాతం ఉత్తీర్ణత సాధించారు. 266 మందికి 246 మంది ఉత్తీర్ణులయ్యారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 40 మందికి 35 మంది, కుంచవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 30 మందికి 26 మంది, కేజీబీవీ, దహెగాంలో 38 మందికి 33 మంది, చినరాస్పెల్లిలో 42 మంది విద్యార్థులకు 41 మంది, ఇట్యాల 42 మందికి 41 మంది, బీబ్రా 14 మందికి 12 మంది, కల్వాడ ఆశ్రమ పాఠశాలలో 21 మందికి 20 మంది, మండల కేంద్రంలోని స్థానిక ప్రైవేట్ పాఠశాలలో 39 మంది విద్యార్థులకు గాను 38 మంది ఉత్తీర్ణులయ్యారు.

మండల టాపర్లుగా అంజలి, అజయ్‌కుమార్..

పదో తరగతి ఫలితాల్లో మండలంలోని చినరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పా ఠశాలకు చెందిన తు మ్మిడ అజయ్‌కుమార్ 531 మార్కులు, స్థానిక కేజీబీ వీకి చెందిన మారిశెట్టి అంజలి 531 మార్కులు సా ధించి మండల టాపర్లుగా నిలిచారు. ఇట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైష్ణవి 524 మార్కులు, బీబ్రాలో వర్షిణి 467, కల్వాడ ఆశ్ర మ పాఠశాలలో జాడి లోకేశ్ 504, సెయింట్ ఫ్రాన్సిస్ ప్రైవేట్ పాఠశాలలో జాడి మౌనిక 528 మార్కులు సాధించారు.


మారిశెట్టి అంజలి


తుమ్మిడ అజయ్‌కుమార్

ఏడు పాఠశాలల్లో వంద శాతం

కెరమెరి: మండల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మెరిశారు. మండలంలోని ఏడు పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. ఆయా పాఠశాలల్లో మొత్తం 336 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 335 మంది ఉత్తీర్ణత సాధించారు. గోయగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 35 మంది, ఝరి ఉన్నత జిల్లా పరిషత్ పాఠశాలలో 9, ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 14, అనార్‌పల్లిలో 31, హట్టిలో 54, మోడిలో 76, మోడి కేజీబీవీలో 37 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. కెరమెరి జెడ్పీఎస్ఎస్‌లో 80 మంది విద్యార్థులకు 79 మంది ఉత్తీర్ణత సాధించారు. మండల టాపర్ ఆశ్రమ ఉన్నత పాఠశాల మోడి(బాలికలు) విద్యార్థిని పెందోర్ గీతాంజలి 530 మార్కులు సా ధించింది. అదే పాఠశాలకు చెందిన కుమురం ప్రియాంక 525 మార్కులు సాధించింది. ఎంఈవో ఆ డే ప్రకాశ్, ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ ద త్తు ప్రసాద్ ఉత్తమ ఫలి తాలు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.


గీతాంజలి


ప్రియాంక

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ


పుల్ల అంజలి


నల్ల శ్రావ్య

పెంచికల్‌పేట్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. 143 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వీరిలో 121 మంది ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీకి చెందిన విద్యార్థులు పుల్ల అంజలి 507 మార్కులు, నల్ల శ్రావ్య 501, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మహేశ్వరి 491, జ్ఞానేశ్వర్ 491, వైష్ణవి 486, ఆశ్రమ పాఠశాల ఎల్లూర్‌కు చెందిన నికాడి సంతోష్ 433 మార్కులను సాధించారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థినులను ఎస్‌వో కవిత, ఉపాధ్యాయులు అభినందించారు.

రెబ్బెనలో..


గుర్లె విఘ్నేశ్

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో మండలంలోని విద్యార్థులు 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 317 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 280 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తుంగెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాలలో 16 మందికి 16 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. నవేగాం జెడ్పీ హైస్కూల్‌లో 27 మందికి 18 మంది (66శాతం), రెబ్బెన జెడ్పీ హైస్కూల్‌లో 72 మందికి 58 మంది (80.5 శాతం), రెబ్బెన సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో 80 మందికి 75 మంది (98.7 శాతం), కేజీబీవీలో 39 మందికి 37 మంది (94శాతం), నంబాల జెడ్పీ హైస్కూల్‌లో 23 మందికి 22 మంది (95.6 శాతం), గంగాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో 42 మందికి 40 మంది (95.2 శాతం), తక్కళ్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 7గురికి 3 మంది (42.8 శాతం), అన్నపూర్ణ హైస్కూల్‌లో 10 మందికి 10మంది (100 శాతం) ఉత్తీర్ణత సాధించారు. రెబ్బెన జెడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లీష్ మీడియంకు చెందిన గుర్లె విఘ్నేశ్ 545 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాల టాపర్‌గా నిలిచాడు. పాఠశాల హెచ్‌ఎం విజయరాణితో పాటు ఉపాధ్యాయులు విఘ్నేశ్‌ను అభినందించారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ..


వై. అనూష

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర, బాలికల పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. స్థానిక సాంఘిక సంక్షేమ డీపీఐపీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన వై. అనూష 582 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలువగా, ద్వితీయ స్థానంలో నిలిచిన సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన ఆర్.అభిషేక్ 541 మార్కులు సాధించాడు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాలలో విద్యార్థులు 89.3 శాతం ఉత్తీర్ణత సాధించారు. బుధవారం విడుదలైన ఫలితాలను మండల విద్యాధికారి జయరాజ్ వెల్లడించారు. మండలంలో మొత్తం తొమ్మిది ఉన్నత పాఠశాలలు ఉండగా రవీంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాబాపూర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, డబ్బా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 87 మంది బాలురు, 120 మంది బాలికలు మొత్తం 207 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యారు. బాలురులో 73 మంది 83.9శాతం, బాలికల్లో 112 మంది 93.3శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని గాయత్రి విద్యాలయానికి చెందిన పాలె వైష్ణవి 570 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన వాసాల వేణు 557 మార్కులతో రెండో స్థానంలో నిలిచాడు.

‘కృష్ణవేణి’ విద్యార్థుల సత్తా


భార్గవి

కాగజ్‌నగర్‌రూరల్: పదో తరగతి ఫలితాల్లో కాగజ్‌నగర్ పట్టణంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మొత్తం 38 మంది విద్యార్థులకు గాను అందరూ పాస్ కాగా, 37 శాతం విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారు. కె.భార్గవి 567 మార్కులు, కె.శృతి 557, సాయి స్లోకా 555, సాన్వి 555, పి.స్పందన 549, కె.వాసవి 539, ఎ.తన్మయిశ్రీ 539 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను కరస్పాండెంట్ సురవర్ధన్, ప్రిన్సిపాల్ ప్రవీణ్ అభినందించారు.


శృతి


సాయి స్లోకా


డి. సాన్వి


పి.స్పందన


కె.వాసవి


ఎ.తన్మయిశ్రీ

మెరుగైన ఫలితాలు..

కౌటాల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదో తరగతి వార్షిక ఫలితాల్లో మండల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా మెరుగైన మార్కులు పొందారు. బోదంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 13 మంది విద్యార్థులకు 11 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కౌటాల ఉన్న త పాఠశాలలో 91 విద్యార్థులకు 67 మంది, ముత్తంపేట జెడ్పీ పాఠశాలలో 26 విద్యార్థులకు 23 మంది, గుండాయిపేట్ ఉన్నత పాఠశాలలో 18 మంది విద్యార్థులకు 11 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కౌటాల కేజీబీవీ పాఠశాలలో మొత్తం 37 మంది విద్యార్థులకు 33 మంది, మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాలలో 16 మంది వి ద్యార్థులకు 14 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సా ధించారు. కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి సాయికృష్ణ 559 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా టాపర్‌గా నిలిచాడు. మండ ల కేంద్రంలోని మయూరి విద్యాలయంలో చదువుతున్న కౌటాలకు చెందిన దుర్గం వర్షశ్రీ 578 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. కాగా కేజీబీవీలో చదువుకున్న సాయిప్రియ 515 మార్కులు పొందింది. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.


సాయికృష్ణ


దుర్గం వర్షశ్రీ

63 శాతం ఉత్తీర్ణత..

కాగజ్‌నగర్‌రూరల్: పదో తరగతి ఫలితాల్లో కాగజ్‌నగర్ మండలంలో 63 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వాసాల ప్రభాకర్ తెలిపారు. మండలంలోని 16 ప్రభుత్వ పాఠశాలల్లో 579 మంది విద్యార్థులకు 364 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. మండలంలోని కేజీబీవీ పాఠశాలలో 38 మంది విద్యార్థులకు 34 మంది విద్యార్థులు పాసయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పెట్రోల్‌పంపు) విద్యార్థి రింషా తబస్సుమ్ 600 మార్కులకు 551 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలువగా, కేజీబీవీ విద్యార్థి షెండె నందిని 527 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈసందర్భంగా టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ఎంఈవో అభినందించారు.


రింషా తబస్సుమ్


షెండె నందిని ➤

బెజ్జూర్ టాపర్‌గా అనిల్

బెజ్జూర్: పదో తరగతి ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. బెజ్జూర్ జెడ్పీఎస్ఎస్‌లో 104 మందికి 93 మంది విద్యార్థులు పాసయ్యారు. సోమిని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. సలుగుపల్లి జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో 35కు 32 మంది పాసయ్యారు. అక్కడి విద్యార్థి పిల్లల అనిల్ కుమార్ 523 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. రెండో స్థానంలో కేజీబీవీ విద్యార్థిని బట్ట కావేరి 522 మార్కులు సాధించినట్లు ఎంఈవో సునీత తెలిపారు.

పశుగ్రాసం పాట్లు

- అల్లాడుతున్న మూగజీవాలు
- వరిగడ్డి కొనుగోలు చేస్తున్న రైతులు
- ఎకరం వరిగడ్డికి రూ. 2వేల నుంచి రూ. 3వేలు
- పశుగ్రాసం నిల్వ చేసుకుంటున్న రైతులు


ట్రాక్టర్‌లో పశుగ్రాసం తరలిస్తున్న రైతు

దహెగాం: జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా ఉంది. వేసవి వచ్చిందంటే చాలు మూగజీవాలు పశుగ్రాసం కోసం అల్లాడుతున్నాయి. జీవాలు మేత కోసం ఎటు వెళ్లినా పచ్చిగడ్డి దొరకడం లేదు. ఎండు గడ్డి తిని కడుపు నింపుకుంటున్నాయి. మూగజీవాలకు, రైతులకు ఎనలేని సంబంధం ఉంది. వేసవిలో మూగజీవాల కడుపు నింపడానికి అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. పచ్చిగడ్డి దొరక్క ప్లాస్టిక్ కవర్లు, అట్ట ముక్కలను తిని మృత్యువాత పడిన సందర్భాలూ ఉన్నాయి. మూగజీవాల కడుపు నింపడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. చెరువులు, కుంటలు, ఒర్రెలు ఎండిపోవడంతో దాహం తీర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాయి. చేతి పంపులు, వాటర్ ట్యాంకుల వద్ద నిర్మించిన నీటి తొట్టీలు ధ్వంసం కావడంతో దాహం తీర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాయి.

మండలంలో 32,110 పశువులు..

మండలంలో పశుసంవర్ధక శాఖ లెక్కల ప్రకారం 32,110 మూగ జీవాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. అందులో ఆవులు 17,510, గేదెలు 2,900, మేకలు, గొర్రెలు, 11,700 ఉన్నాయి. రైతులు పశువులను ఉదయం మేతకు వదులుతున్నారు. చేలు చెలక తిరిగి పచ్చిగడ్డి దొరక్క ఎండు గడ్డి తిని మధ్యాహ్నం వరకు ఇంటికి చేరుకుంటున్నాయి. ఇంటికి వచ్చిన సమయంలో వాటి దాహం తీర్చి జొన్న చొప్ప, ఎండు వరిగడ్డిని మేతగా వేస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. మళ్లీ సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో మరోసారి మేతకు వదులుతున్నామంటున్నారు.

వరిగడ్డిని కొనుగోలు చేస్తున్న రైతులు..

యాసంగి వరి కోతలు పూర్తి దశకు చేరాయి. వరి కోతలు కాగానే రైతులు వచ్చి వరిగడ్డిని కొనుగోలు చేస్తున్నారు. ఎకరం వరి గడ్డిని రూ.2వేల నుంచి రూ.3 వేల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నామని పలువురు రైతులు పేర్కొంటున్నారు. కొనుగోలు చేసిన వరిగడ్డిని ఎడ్ల బండ్లలో, ట్రాక్టర్‌లలో తరలిస్తున్నారు. కొందరు రైతులు గడ్డిని గుండ్రంగా కట్టలు కట్టించి తీసుకెళ్తున్నారు. వేసవి వచ్చిందంటే వరిగడ్డిని కొనుగోలు చేసుకుంటున్నామని పేర్కొంటున్నారు. జూన్ నెలలో ఖరీఫ్ పనులు ప్రారంభ సమయంలో వ్యవసాయ పనులు చేపడతామని ఇప్పుడే పశుగ్రాసం కొనుగోలు చేసుకుని నిల్వ చేసుకుంటున్నామని పేర్కొన్నారు.

అందుబాటులో గడ్డి విత్తనాలు..

పశుసంవర్ధక శాఖలో గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. గడ్డి విత్తనాలు వేయడానికి నీటి సౌకర్యం ఉండాలి. చాలా మంది రైతులకు సాగు నీటి సౌకర్యం లేక గడ్డి విత్తనాలు తీసుకెళ్లడానికి ముందుకు రావడం లేదు. నీటి సౌకర్యం ఉన్నవారు గడ్డిని పెంచి పశువుల ఆకలి తీరుస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మూగజీవాలకు వేసవిలో పశుగ్రాసం అందించడంతో పాటు, నీటి తొట్టీలలో నీరు నింపి దాహం తీర్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వరిగడ్డి కొంటున్నాం..



వరి కోతలు కాగానే వరిగడ్డి కొని ఇంట్లో నిల్వ చేసుకుంటున్నాం. ఖరీఫ్ పనులు ప్రారంభ సమయంలో పశువులకు మేత దొరక్క ఇబ్బందులు పడతాయి. అందుకు ముందుగానే పశుగ్రాసం కొనుగోలు చేసుకుంటున్నాం.

– సత్తన్న, రైతు, దహెగాం

గడ్డి నిల్వ చేసుకుంటున్నాం..



వరికోతలు పూర్తవుతున్నాయి. కోతలు కాగానే ఎడ్లబండ్లలో నింపి గడ్డి నిల్వ చేసుకుంటాం. పశువులు మేతకు వెళ్లినప్పుడు వాటిని నీళ్లు దొరకడం లేదు. పశువుల తొట్టీలలో నీళ్లు నింపితే మూగజీవాలకు దాహం తీరుతుంది.

– తుమ్మిడె సత్యనారాయణ, రైతు, దహెగాం

‘యువ వికాసం’ దరఖాస్తుల పరిశీలన

కెరమెరి: యువ వికాసం పథకానికి దరఖాస్తులు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థుల దరఖాస్తులను ఈ నెల 2 నుంచి 9 వరకు పరిశీలించనున్నట్లు ఎంపీడీవో అంజద్‌పాషా ఒక ప్రకటనలో తెలిపారు. 2న ధనోరా, గోయగాం, కొఠారి, పార్డ, రింగన్‌ఘాట్, ఖైరీ, ఆగర్‌వాడ గ్రామ పంచాయతీలకు చెందిన అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన ఉండగా, 3న బాబేఝరి, టోకేన్‌మోవాడ్, మెట్టపిప్రి, సావర్‌ఖెడా, సుర్దాపూర్, 5న అంతాపూర్, భోలాపటార్, కెలిబి, సాకడ, సాంగ్వి, 6న గోండ్‌గూడ, ఇందాపూర్, ఝరి, నిసాని, మోడి, 7న అనార్‌పల్లి, బోరాలాల్‌గూడ, దేవాపూర్, కరంజివాడ, ముకదంగూడ, పరంధోళి, తుమ్మగూడ, 8న కెరమెరి, 9న, కెరమెరి, కెస్లాగూడ గ్రామ పంచాయతీలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీ లన చేస్తామన్నారు. ఆయా తేదీల్లో దరఖాస్తుదారులు ఎంపీడీవో కార్యాలయానికి నిజధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

రేపటి నుంచి దరఖాస్తుల పరిశీలన

రెబ్బెన: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నుంచి రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలనలతో పాటు మండల స్థాయి కమిటీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో శంకరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 2న రెబ్బెన, ఇందిరానగర్ పంచాయతీల పరిధిలో బీసీ, మైనార్టీ, ఈబీసీ, కార్పొరేషన్‌ల వారికి, 3వ తేదీన ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌ల ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి, 5వ తేదీన గోలేటి, కై రిగూడ పంచాయతీలో బీసీ, మైనార్టీ, ఈబీసీ, కార్పొరేషన్ల వారికి, 6వ తేదీన ఎస్టీ కార్పొరేషన్‌ల వారికి, 7వ తేదీన ఎస్సీ కార్పొరేషన్‌ల వారికి, 8వ తేదీన వంకులం, రాంపూర్, నవేగాం, దర్మారం, లక్ష్మీపూర్ పంచాయతీ పరిధిలో అన్ని కార్పొరేషన్ల దరఖాస్తుదారులకు, 9వ తేదీన కొండపెల్లి, కై రిగాం, కొమురవెల్లి పంచాయతీల వారికి, 12న పులికుంట, తక్కళ్లపల్లి, రాజారాం, రోళ్లపహాడు పంచాయతీల వారికి, 13న నారాయణపూర్ పంచాయతీ పరిధిలోని దరఖాస్తుదారులకు, 14న నంబాల, 15న తుంగెడ, మాద్వాయిగూడ పంచాయతీ పరిధి దరఖాస్తుదారులకు, 16న కిష్టాపూర్, జక్కులపెల్లి, పాశిగాం పంచాయతీల పరిధి దరఖాస్తుదారులకు, 17న గంగాపూర్ పంచాయతీ పరిధి అన్ని కార్పొరేషన్ల దరఖాస్తుదారులను మండల స్థాయి కమిటీ పరిశీలించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని గ్రామపంచాయతీల వారీగా నిర్ణయించిన తేదీల్లో దరఖాస్తుల పరిశీలనకు హాజరుకావాలని సూచించారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు సహకరించాలి


అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని షూర్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ గద్దలపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ శ్రీకేశవనాథ స్వామి ఆలయంలో అర్చకులు, భక్తులకు బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ఇవ్వకూడదన్నారు. 2030 నాటికి బాల్యవివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అర్చకులు సంతోష్‌శర్మ, నరేష్‌శర్మ, విజయ్‌కుమార్, సతీష్, ఎగ్రస్ అనిల్, రాంచందర్, భక్తులు పాల్గొన్నారు.

‘ఇందిరమ్మ’ సర్వే అడ్డగింత

తాంసి: అర్హులైన వారికి కాకుండా అనర్హులుగా ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారని ఆరోపిస్తూ బుధవారం గోట్కూరిలో గ్రామస్తులు ఇందిరమ్మ ఇంటి సర్వేను అడ్డుకున్నారు. బుధవారం గ్రామానికి సర్వే చేయడానికి వచ్చిన ఎంపీడీవో మోహన్ రెడ్డిని పంచాయతీ కార్యాలయంలో అడ్డుకున్నారు. అర్హులకు కాకుండా అనర్హులకు ఇళ్లను కేటాయిస్తున్నారని మండిపడ్డారు. ఇళ్లు లేక, ఇళ్లు కూలిపోయిన వారికి కాకుండా ఇతరులకు ఎలా కేటాయించారన్నారు. మళ్లీ కమిటీ ద్వారా సర్వే చేసి అర్హులను గుర్తించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు భగవాండ్లు, సురేశ్, షరీఫ్, నవీన్ గ్రామస్తులు ఉన్నారు.